క్లుప్తంగా

లోటస్ టెంపుల్‌లో భక్తుల సందడి



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ సమీపంలోని స్వామి నారాయణ గురుకుల్ లోటస్ టెంపుల్‌లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు దినం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు శివలింగానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి దర్శనంతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు



జ్యోతిరావు పూలే విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వకుండా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ సన్నాహాలు చేస్తుందని పేర్కొన్నారు. బీసీలను మరోసారి మోసం చేయడానికి సర్కార్ పావులు కదుపుతుందని ఆరోపించారు. రిజర్వేషన్లు కల్పించిన తరువాతే ఎన్నికలకు వెళ్లాలంటూ ఆదివారం మండల కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేశారు. విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రిజర్వేషన్లు అమలు చేయకపోతే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, నాయకులు సిద్దిగారి దాసు, క్యామ వెంకటేశ్, మహేశ్, యాదయ్య, అంజి, సురేశ్, కుమార్, సురేశ్ తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, 11 ఏళ్లుగా ప్రధాని మోదీ సాధించిన విజయాలను పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా నాయకుడు బండెల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం విఠాయిపల్లి గ్రామంలో వికసిత్‌భారత్‌లో భాగంగా నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, నాయకులు నర్సింహ, లక్ష్మణ్, కృష్ణనాయక్, రాములునాయక్, రవిరాథోడ్, రాములు, జగన్‌రెడ్డి, సాయిబాబా, లక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికే గుర్తింపు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

యాచారం: పార్టీ బలోపేతం కోసం శ్రమించే వారికి, ప్రజల్లో గుర్తింపు ఉన్నవారికి మాత్రమే స్థానిక ఎన్నికల్లో టికెట్లు లభించే అవకాశం ఉందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండలంలోని తమ్మలోనిగూడ గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ అయిలయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, కె.శ్రీనువాస్‌రెడ్డి, బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్, సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు లక్ష్మీపతిగౌడ్, అరవింద్‌నాయక్, వెంకట్‌రెడ్డి, కర్రె బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బడి.. అసౌకర్యాల ఒడి

- కాంపౌండ్ వాల్, మరుగుదొడ్లు లేక విద్యార్థుల ఇక్కట్లు
- ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సుమారు రూ.26లక్షలు మంజూరు
- నిధులున్నా నిర్మాణాలకు వెనుకడుగు
- పట్టించుకోని అధికారులు



కేశంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

కేశంపేట: 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో పాఠశాలను నూతనంగా నిర్మించారు. కానీ పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులను కల్పించడం లేదు. దానికి అవసరమైన నిధులు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వారు టాయిలెట్‌కి రోడ్డుపైకి, మరుగుదొడ్డికి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మౌలిక వసతులు కరువు

మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారుగా 90 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతంలో పాఠశాల నిర్మాణానికి సుమారుగా రూ.42 లక్షల నిధులు మన ఊరు మన బడి పథకం ద్వారా మంజూరయ్యాయి. పాఠశాలతో పాటుగా కాంపౌండ్‌వాల్, కిచెన్ షెడ్, మరుగుదొడ్ల నిర్మాణాలకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారుగా రూ.26 లక్షల నిధులు మంజూరయ్యాయి. పనుల కోసం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పాఠశాల గదుల వరకు నిర్మించాడు. ఆ నిధులు నేటికీ మంజూరు కాకపోవడంతో కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, మరుగుదొడ్లను నిర్మించలేదు.

రహదారి పక్కనే పాఠశాల

కేశంపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గ్రామం నుంచి జడ్చర్ల వెళ్లే రోడ్డు పక్కనే ఉంటుంది. ఈ రోడ్డుపై ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో పాఠశాల విద్యార్థులు టాయిలెట్స్‌కు, మరో అవసరాలకు రోడ్డుపైకి రావడానికి జంకుతున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను బయటకు వదిలేటప్పుడు రోడ్డు పక్కకు వెళ్లకుండా రక్షణగా ఉంటున్నారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు

విద్యార్థులకు మరుగుదొడ్లు లేకపోవడంతో రోడ్డు పక్కన, ఇళ్ల మధ్యన టాయిలెట్ చేస్తున్నారు. విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంపౌండ్ వాల్ లేకపోవడంతో మూగజీవాలు, గ్రామస్తులు పాఠశాల ఆవరణలో బహిరంగంగా తిరుగుతున్నారు. దీంతో పిల్లలకు రక్షణ లేకుండా పోయింది. కిచెన్‌షెడ్ లేకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులతో వంట చేస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు వంట చేసేందుకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. పాఠశాలకు కాంపౌండ్ వాల్‌తో పాటుగా కిచెన్‌షెడ్, మరుగుదొడ్ల నిర్మాణానికి సుమారు రూ.26లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులు దుర్వినియోగం కాకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుకొచ్చి పనులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తీర్మానం ఇస్తే పనులు చేస్తా



గ్రామ పంచాయతీ ద్వారా తీర్మానం ఇస్తే పాఠశాల కాంపౌండ్ వాల్‌తో పాటు కిచెన్‌షెడ్, మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపడుతాను. గతంలో 'మన ఊరు–మన బడి' ద్వారా పాఠశాల తరగతి గదుల నిర్మాణం చేస్తే నేటికీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామ పంచాయతీ తీర్మానం లేకపోతే బిల్లులు వచ్చే సమయానికి ఇబ్బందులు ఎదురవుతాయి. తీర్మానం ఇస్తే నిర్మాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నాను.

– తలసాని వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కేశంపేట

అభివృద్ధికి కృషి



పాఠశాలకు మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. త్వరలోనే పాఠశాలకు కాంపౌండ్ వాల్‌తో పాటు మరుగుదొడ్లు, కిచెన్ షెడ్ నిర్మాణాలను పూర్తిచేసి అభివృద్ధి కృషి చేస్తాం. పాఠశాలను మండలంలో ఆదర్శంగా చేస్తాం.

–శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ అసెంబ్లీ కన్వీనర్ టంగుటూరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రోజు రోజుకు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని, అరికట్టి పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకొని అమ్మకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీ బూత్‌లో వంద మొక్కలు నాటే కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. మొక్కలు నాటే కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా కమ్మదనంలో నిర్వహించే మొక్కలు నాటే కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ విచ్చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, చేగు సుధాకర్, శ్యాంసుందర్ రెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న నాయికులు

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి రాగళ్ల ఉపేందర్

మొయినాబాద్‌రూరల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి రాగళ్ల ఉపేందర్‌మాదిగ అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్‌లో నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఊరూరా జెండా ఆవిష్కరణలు చేయాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరు కావాలన్నారు. మందకృష్ణ మాదిగ పోరాటంతోనే రిజర్వేషన్ సాధించుకున్నామన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయిలో కమిటీలు వేసి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొండిగారి మహేందర్, పెద్దోళ్ల నర్సింహ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- రోడ్లపైనే పారుతున్న మురుగునీరు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

మొయినాబాద్ మున్సిపాలిటీలో మురుగునీటి పారుదల అస్తవ్యస్తంగా మారింది. సరైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. మున్సిపల్‌లోని భరద్వాజ్ కాలనీ, సహారా కాలనీ, స్టార్ కాలనీ, విజయనగర్ కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ఏర్పాటు చేయలేదు. ఆయా కాలనీల లేఅవుట్ చేసినప్పుడే వెంచర్ చేసినవారు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు వేయాల్సి ఉన్నా అప్పట్లో అవేవి పట్టించుకోలేదు. లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న తర్వాత ఇబ్బందులు మొదలయ్యాయి. ఆయా కాలనీల్లో గత ఐదేళ్లలో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు అధికంగా జరిగాయి. ఆ ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరంతా రోడ్లపైన, పక్క నుంచి కాలువలుగా పారుతుండడంతో దుర్వాసన, ఈగలు, దోమలతో రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్, ఎన్కేపల్లి, అజీజ్‌నగర్, చిలుకూరు, పెద్దమంగళారం గ్రామాల్లో సైతం పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. మున్సిపల్ పరిధిలో పరిస్థితి దారుణంగా ఉన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని కోరుతున్నారు.



భరద్వాజ్ కాలనీలో ఇళ్ల ఎదుట పారుతున్న మురుగునీరు



స్టార్ కాలనీలో రోడ్డు పక్క నుంచి కాలువలా పారుతున్న మురుగునీరు

గోశాలకు దాణా అందజేత



గోశాలకు కుట్టిని అందజేస్తున్న దాత పవన్‌కుమావత్

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలోని శ్రీకృష్ణ గోశాలకు ఆదివారం శివశక్తి ప్లైవుడ్ అండ్ హార్డ్‌వేర్ యజమాని పవన్ కుమావత్ రూ.80వేల విలువ చేసే ఒక లారీ లోడు కుట్టి(దాణ)ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ వార్డు సభ్యుడు సింగపాగ లక్ష్మయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. గోవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం దాణ అందజేసిన దాత పవన్‌కుమావత్‌కు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం అంతారం గ్రామానికి చెందిన ఎండీ ఆరిఫ్ కూతురు సమ్రిన్‌బేగం గుండె శస్త్ర చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం నగరంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.. బాధితులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ అంజయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, మాజీ ఉపసర్పంచ్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్

ఆమనగల్లు: ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూటీఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ అన్నారు. సంఘం కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, సంఘం రాష్ట్ర నాయకుడు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డితో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం సదానందం మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘాలతో రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. హెల్త్‌కార్డులు, పీఆర్సీ, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం నాయకులు ఉద్యోగ విరమణ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పాండురంగారెడ్డి, మండల అధ్యక్షుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి, మాడ్గుల అధ్యక్షుడు నవీన్, తలకొండపల్లి అధ్యక్షుడు క్రాంతి కుమార్, నాయకులు ఉన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పట్టణ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏడో వార్డు వెంకటరమణ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టిన పార్కు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. వంద కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రజల కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో నాయకులు బాబర్‌ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, బస్వం, చెంది తిరుపతిరెడ్డి, ఇబ్రహీం, ప్రవీణ్, అశోక్, కరుణాకర్, డాక్టర్ రమేశ్ బండారి, అందె మోహన్, సత్తయ్య, వెంకటేశ్, రాజు, సాయికృష్ణ, మాధవులు, మంగ మధు, నీరటి వాసు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే సమస్యలు పరిష్కారం

బీసీసేన నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న బీసీసేన నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, రాజ్యాధికారంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని బీసీసేన నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాసుమల్లగూడ, నాగులపల్లి గ్రామాల్లో బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. మహిళలందరూ ఐకమత్యంతో ఏకతాటిపైకి రావాలని సూచించారు. మహిళలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల బీసీసేన మహిళా కమిటీలను ఎన్నుకున్నారు. రాసుమల్లగూడ నూతన కమిటీ అధ్యక్షురాలిగా నత్తి శివలీల, ఉపాధ్యక్షురాలిగా రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా శ్యామలమ్మ, కార్యదర్శిగా నర్సమ్మ, సహాయ కార్యదర్శిగా నిర్మల, కోశాధికారిగా పద్మమ్మ, సభ్యులుగా వనజ, కిష్టమ్మ, నాగులపల్లి కమిటీ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా లావణ్య, ప్రధాన కార్యదర్శిగా పోలెపల్లి భాగ్యమ్మ, కార్యదర్శిగా చాకలి అంజమ్మ, సహాయ కార్యదర్శిగా సంతోష, కోశాధికారిగా వడ్లలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులకు నియామకపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో బీసీసేన నాయకులు చంద్రశేఖరప్ప, మేకల వెంకటేశ్, నర్సింలు, జయశ్రీకాంత్, భాగ్యలక్ష్మి, స్రవంతిరాజ్, మహిళలు పాల్గొన్నారు.

భక్తులందరూ ఐక్యతతో ముందుకుసాగాలి

అయ్యప్ప పాదయాత్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్‌రూరల్: అయ్యప్పమాల ధరించే భక్తులందరూ కులమతాలకతీతంగా పాదయాత్ర చేపడతారని రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు, అయ్యప్ప పాదయాత్ర కమిటీ సభ్యుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్రంలోని ఆయా జిల్లాలకు చెందిన అయ్యప్ప పాదయాత్ర భక్తులు పెద్దఎత్తున సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రలో పాల్గొనే సభ్యులందరూ సభ్యత్వ నమోదు తీసుకోవాలని సూచించారు. భక్తులందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. శబరిమలకు వెళ్లు సమయంలో పాదయాత్ర సంఘం ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకుందామన్నారు. అదేవిధంగా పాదయాత్రలో వెళ్తున్న సభ్యులు ప్రమాద బీమా చేసుకున్న వారే అని, వారికి ఎలాంటి ప్రమాదం జరిగిన బీమా అమలు చేసేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో అల్లం శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌నాయుడు, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, బుచ్చిబాబు, రమేశ్, రతన్, డాక్టర్ మోహన్, దేవేందర్‌రెడ్డి, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



పెంజర్ల రోడ్డులో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

- ఇళ్ల మధ్యన, రోడ్ల పక్కన కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లు
- భయాందోళనలో స్థానికులు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: జనావాసాల మధ్యన ఎలాంటి రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజల పాలిట మృత్యుపాశాలుగా మారాయి. అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు మాత్రం జనావాసాల మధ్య ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ చర్యలు చేపట్టడం లేదు. అంతేకాకుండా పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సరైన ఎర్తింగ్ లేని కారణంగా వర్షాలు పడితే కొద్దిదూరం వరకు షాక్ వస్తున్న సంఘటనలు సైతం చోటు చేసుకున్నాయి.

జనావాసాల మధ్య..

మండల కేంద్రంలోని నారాయణగూడకాలనీ, పెంజర్లకు వెళ్లు ప్రధాన రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలేని కారణంగా జనావాసాల మధ్యన ప్రమాదభరితంగా మారాయి. నారాయణగూడ కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో చిన్నారులు ఆడుకుంటుంటారు. ఇక్కడ ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని పలువురు వాపోతున్నారు. ఇక పెంజర్ల రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి ప్రధాన రహదారి ఉండడంతో వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణం కొనసాగిస్తుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇన్ముల్‌నర్వలో జనావాసాల మధ్యన ఏర్పాటు చేసిన పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదరంగా మారాయి. వాటిని వేరేచోటుకు మార్చడంతో పాటు ప్రమాదాలు జరగకుండా రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని పలుమార్లు గ్రామస్తులు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపుతాం



మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను ఇప్పటికే తొలగించాం. దాంతో పాటుగానే ప్రధాన రోడ్లు, ఇళ్ల మధ్యన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు జరగకుండా కంచెల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం.

– రమేష్‌గౌడ్, ట్రాన్స్‌కో ఏఈ, కొత్తూరు.